# ముప్ఫయి లక్షల పందెం.

బాల్యక్రీడల ఋతువులు వేరు. బొంగరాలు, అల్లీలు, గాలి పడగలు, బిళ్ళాకర్రా మొదలైన అనేకానేక ఋతువులు ఉన్నాయి. వీటిధర్మాలు నిఖరంగా చెప్పడం వృత్తభుజాలను లెక్కించటం అంత సులువైనపని. విశాఖపట్టణంలో నా చిన్నప్పటి రోజుల్లో ఒక ఋతువు కొత్తగా జన్మించడం జరిగింది. అదే సిగరెట్టు పెట్టెలాట.

ఈ మహాక్రీడని ఎవరు కనిపెట్టేరో తెలుసుకోడం చాలాకష్టం. ఇది మావూళ్ళోనే తయారయిందని ధీమాగా చెప్పకోడం అంతకన్నాకష్టమైంది విజైనగరం నుండిగాని అనకాపల్లి నుండి గాని దిగుమతి అయి ఉండడానికి అవకాశం ఉండి ఉండవచ్చు. ఈఆట ఎలా ఆడుతారో ముందు తెలియపర్చవలసిన బాధ్యత ఎంతేనా నామీాద ఉందనుకొని ఉపక్రమిస్తున్నా.

సిగరెట్టుపెట్టెలకి రెండుపక్కలుంటాయి. రెండు పక్కలూ చింపి, రూపాయినోట్లలాగా జాగ్రతచేయాలి. పేకముక్కల్లాంటి ఈనోట్లకి విలువలు నిర్ణయించబడతాయి. విల్సుకి వెయ్యి. ప్లెయిర్సుకి వెయ్యి. కత్తెరకి అయిదువందలూ, పాసింగుషోకి వందా, బేర్సుకి యాభై, చారుమినారుకి అయిదూ ఇలా విలువలు ఉంటాయి. ఇప్పుడు ఉజ్జాయింపుని చెప్తున్నాను. అసలు విలువలు మర్చిపోయేను.

ఈ నోట్లని ప్రతీ ఆటగాడూ ముందు జాగ్రత పరుచుకోవాలి. పిదప ఆటగాళ్ళు ఒక గిరి వృత్తాకారంలో గీసి

అందులో పందెం పెట్టాలి. మర్చిపోయాను. ఈ ఆటలో మరో ముఖ్యమైన పనిముట్టు తాండ్రబెత్తు. పందెం వేసిన తర్వాత గిరి దగ్గిర నిలబడి మొదటి ఆటగాడు తన బెత్తుని తనకి అభిముఖంగా నేలకి సమానాంతరంగా విసురుతాడు. తక్కినవాళ్ళు, దాన్ని గురిచూచి తమ బెత్తులు, ఒకరి తరవాత ఒకరు విసరాలి. ఈ విసరడంలో మొదటివాడి బెత్తుని ఎవడు కొట్టగలడో వాడికి ఆపందెండబ్బంత పోతుంది. గాని, ఈ రెండోవాడి బెత్తునిమూడోవాడు కొట్టగలిస్తే వాడికే ఆసొమ్మంతా చెందుతుంది. ఇలాగ ఎందరు ఆటగాళ్ళు ఉంటే అందరు. లేక ఎవరూ తొలివాడి బెత్తుకొట్టలేకపోతే ఆటసాగేవిధం ఏమిటంటే-

తొలిఆటగాడు బెత్తుపడ్డచోటునుంచి గిరికిఅభిముఖంగా నిలబడి గిరిమధ్య పెట్టబడిన డబ్బును గురిచూచి బెత్తుని విసరాలి. నోట్లని బెత్తు తాకితే ఆడబ్బంతా వాడి అధీనమవుతుంది. లేదా తక్కిన ఆటగాళ్ళుకూడా తొలివాడిలా తమ బెత్తుల్ని విసిరి తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటారు. ఆతరవాత ఒక్కొక్కడూ, వరుసప్రకారం బెత్తుతో గిరిలోఉన్న నోట్లని గిరిపైకి వచ్చేటట్లు కొడతారు. ఒక్కొక్కసారి ఎంత డబ్బుపైకొస్తే అంతా ఆ ఆటగాడికిలాభం చివరి నోటు పైకొచ్చేదాక ఆట సాగుతుంది. తిరిగి కొత్తగా మరోసారి ఆట ప్రారంభించవచ్చు.

ఈవిధమైన ఆట 'ఉకంవీధి' లో ఆడుకొంటున్న రోజుల్లో ఒకనాడు రాంభొట్లవారి ప్రసాదంగాడు వచ్చి మా కో కొత్తరకం సిగరెట్టుపెట్టి చూపించేడు, అది మాజ

న్మలో మే మెన్నడూ చూసిఉండలేదు. వాడు బొంబా యిలో దానికి లక్షవిలువఉంది అని ప్రకటించాడు. మేము అభ్యంతరం పెట్టలేదు. అది వాళ్ళన్న మిలట్రీనుంచి తెచ్చే డని వాడు చెప్పేడు. మిలట్రీ సిగరెట్టుపెట్టె కాబట్టి మేము ఏకగ్రీవంగా దానికి లక్షవిలువ ఉందని తీర్మానించేం.

ప్రసాదం గాడిని తలొకటి చొప్పున పంచిపెట్టమని వినయ విధేయతలతో కోరాము. వాడు సమ్మతించలేదు. వాడిదగ్గర అలాంటివి ముప్ఫయి ఉన్నాయి. కాబట్టి మాకు ఇవ్వననడంలో వాడి పిసినిగొట్టుతనాన్ని అందరం ఖండించేం. వాడు వింటేగా!'

చివరకి ఒకషరతు పెట్టేడు. వాడి ముప్ఫయిలక్షలూ ఒకేసారి వాడు పందెంవేసి గెల్చుకోమన్నాడు. మేం వప్పు కోలేదు. మా అందరిదగ్గరా ఉన్నది కలసినా ముప్ఫయి లక్షలు లేవు. అంచేత రెండు రెండు లక్షలుగా పందెం వెయ్యమన్నాం. వాడు అంగీకరించలేదు. గరుడానాన్నయలు చిన్నం వీధిలో విల్సుకి పదివేలు అని సమయానికి అన్నాడు. మా కరెన్సీకి అవసరాన్నిబట్టి విలువల హెచ్చుతగ్గులు సంభవిస్తూ ఉంటాయి. ప్రసాదంగాడు ఇది అన్యాయం అన్నాడు. గాని మా అందరి ఆమోదాన్నిపొంది విల్సుకి పదివేల విలువ లభించింది.

అయినా మా అందరి దగ్గరా కలిపి ఇరవైఅయిదు లక్షల చిల్లర అయింది. మేమూ ప్రసాదంగాడితో ప్రకా శాన్ని ఆడమన్నాం. గిరాట (ఈఆటకి మరోపేరు)లో వాడు అందెవేసిన చెయ్యి. బెత్తు విసరడంలో నోట్లని గిరిపైకి తియ్య

డంలో సులువులెన్నో వాడికి కరతలామలకం. ప్రకాశంగాడు వప్పుకున్నాడు. కాని ఆర్థికప్రతిష్టంభన ఏర్పడ్డది. ధనానికి కొరత ఏర్పడ్డది.

సమిష్టిగా మేమంతా ప్రసాదంగాడిని ఒక అయిదు లక్షలు అప్పు ఇమ్మని ప్రార్థించేం. మాకు ధైర్యముండంది ప్రకాశం గెలుస్తాడని. ప్రసాదం మొండిపట్టు పట్టాడు. ఇవ్వను గాక ఇవ్వను అని అన్నాడు. పోనీ పందెం ఇరవై అయిదులక్షలే పెట్టుకుందాం అంటే, నేటి జిన్నాలాగ నాడు ప్రసాదం ససేమిరా అన్నాడు.

చేసేదిలేక పై రాజ్యాలనుండి ధనసహాయం అర్థించేం. చిన్నంవారి వీధి పప్పులవీధి ఈ వార్త పాకింది. ఆవీధుల్లోని హేమాహేమీలు వచ్చి ఈమహాపందెం వీక్షిస్తున్నారు. చిన్నంవీధివాళ్ళు ఒకషరతుమీద ఇస్తామన్నారు. అది ప్రకాశం గెలిచినప్పుడు దానిలోని కొత్త లక్ష ముక్కలు పది వాళ్ళ కివ్వడం, లేక ఓడిపోయినపక్షంలో పదిహేను లక్షలు మూడురోజుల్లో యివ్వడం- ఈ ఒడంబడికమీద మా అందరి సంతకాలుపెట్టినంతగా మేం ఒప్పుకున్నాం.

తీరా, ముప్పైలక్షలూ పందెంగిరిలోపెట్టేక ప్రసాదం గాడు చిన్నంవారి వీధిలోని నాగులకొండవారి అబ్బాయిని మీ వీధిలో విల్లుకి విలువ ఎంత అని అడిగాడు. వాడు మామ్మూలుగా వెయ్యి అని చెప్పగానే ప్రసాదంగాడు చివ్వునలేచి అన్యాయం జరిగిపోతున్నాది అని మొత్తుకోడం

ప్రారంభించేడు. చూస్తున్న తగు మనుష్యులు విల్సుకి వెయ్యి అని అభిప్రాయాన్ని వెలిబుచ్చేరు.

ఇంతదాకా జరగనిచ్చి ఆట సాగకపోడం మంచిది కాదని పప్పులవీథి పసువర్తి వెంకటరావు తనని ఆడనిచ్చే మాటుంటే ఎంత సర్దాలో అంతా సర్దుతానని అన్నాడు. మేం వప్పుకోలేదు. ఏవంటే వెంకటరావుకి ఆట ఏమీరాదు. అయితే ఓ చార్మినారు కూడా యివ్వనని పప్పులవీధిలో వాళ్ళెవరూ ఇవ్వకూడదని వెంకటరావు బెదిరించేడు.

ఇంతట్లోకే నాన్నయలు ప్రసాదంగాడు మనల్ని మోసంచేస్తున్నాడు, దానికి లక్ష విలువ లేదని అన్నాడు. మాకు ఈ సత్యం రుచించలేదు. బొంబాయి మిల్ట్రీ సిగరెట్టు పెట్టె [కి] లక్ష విలువ చెయ్యకపోవడమేమిటి అని ప్రసాదంతోపాటు మేమూ అన్నాం.

చివరకి ఎలాగైతేనేం ప్రసాదంగాడు మా దగ్గర ఉన్నంత సుట్టుకే పందెం వేసిందికి ఒప్పుకున్నాడు. ఆటని ప్రారంభించేం. ఉద్రేకంలో ప్రసాదమే ముందు బెత్తు విసిరేడు. ప్రకాశం దాన్ని సులువుగా కొట్టి ఆట గెలుచుకొంటాడని మేం ఆశపెట్టుకొన్నాం. ప్రకాశం కొట్టలేదు. ప్రసాదంగాడు రెండోసారి బెత్తుతో కట్టంతటినీ తట్టి ఆట గెలుచుకొన్నాడు.

ఆగర్వంతో వాడు (లేని) మీసంతిప్పి, తొడచరిచి, 'ఏక్ దో తీన్ చార్ పాంచి బజానా. అల్లడుకం వీధిముదుం మీద నిలుపు జమానా' అని పెద్దగా పాడి సవాలుచేశాడు.

ప్రకాశంగాడి ఒళ్ళుమండి ప్రసాదంగాడిమీద విరుచుకు పడ్డాడు. మేమూ కలియబడ్డాం. వాడిచేతులోని డబ్బంతా చింపేశాం. వాణ్ని కిందపడగొట్టి వాడి లాల్చీ చింపేశాం. తగు మనుష్యులు చిన్నంవీధి నాగులకొండా, పప్పులవీధి పసుమర్తి వాళ్ళవాళ్ళ అనుచరులతో పోరాటాన్ని ఆపేరు.

కందగడ్డలాంటి మొగంతో ప్రసాదంగాడు 'మామిలట్రీ అన్నయ్య తుపాకీ తెచ్చి మిమ్మల్ని గుండేసి కొట్టకపోతే నాపేరు రాంభొట్ల ప్రసాదం కాదు' అని వెళ్ళిపోయేడు. వాడి లాల్చీఅంతా చిరుగులే. వాడి ఒళ్ళంతా రక్కుళ్ళే.

అంతతో ఆసంవత్సరానికి మాఊళ్ళో గిరాట ఋతువు అంతమైంది.